## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

**దుబ్బాక, ఆగస్టు 19, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష ్యంగా కార్యకర్తలు పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక సిఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష ్యం గా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం యూరియా అందించడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష ్యంగా కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## ఉపాధి హామీ ఆధ్వర్యంలో తెలంగాణ పనుల జాతర: డిఆర్‌డిఓ జ్యోతి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 20, ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈనెల 22 నుండి పనుల జాతర 2025ను ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజలను భాగస్వామ్యం చేయడానికి 22న జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులు స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు రాష్ట్ర మంత్రులతో పనుల జాతరలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో చేపట్టనున్న నూతన గ్రామపంచాయతీ నిర్మాణాలు అంగన్వాడి భవనాల నిర్మాణాలు స్వచ్ఛభారత్ ద్వారా నిర్మించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ సగ్రిగేషన్ షెడ్ కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ ,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టనున్న గ్రామీణ రహదారుల నిర్మాణం తదితర పనులకు, ఈనెల 22న స్థానిక ఎమ్మెల్యేలు ఎంపీలు రాష్ట్ర మంత్రులతో శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.జిల్లాలో 10 విభాగాలకు చెందిన 2451 పనులకు రూ.1959.52 లక్షలు మంజూరయ్యాయన్నారు.



అల్లాదుర్గంలో వరదకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, ఆగస్టు 20, ప్రభాతవార్త: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రమైన అల్లాదుర్గంలో తెగిపోయిన బట్టికుంట చెరువును,బీటీ రోడ్లను, మండల పరిధిలోని చిల్వర్ నల్లకుంట పెద్ద చెరువులను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆయా శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. దెబ్బతిన్న చెరువులకు వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రవహానికి దెబ్బతిన్న అల్లాదుర్గంకు వెళ్లే రహదారికి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఆర్ఐ సందీప్, అల్లాదుర్గం పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపనులను త్వరగా పూర్తిచేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజక వర్గంలో జరిగే నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులకు ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, అలాగే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మండలాల్లో చెరువులను మానిటర్ చేసి కట్ట నాణ్యత చెక్ చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. వనమహోత్సవంలో అటవీశాఖ అధికారులు సిఐ బ్లాక్ ప్రాంతాల్ల ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసి విఐపి ప్లాంటేషన్,ఇతర మొక్కలను ఎల్లప్పుడు మానిటర్ చేయాలని సూచించారు.వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకి ఇరువైపుల చెట్లు నాటే కార్యక్రమం ఆయా శాఖల అధికారులు సైతం వేగం పెంచాలన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం బోనాలు

### మాజీ మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి



బోనాల మహోత్సవంలో పాల్గొన్న హరీష్‌రావు

మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం బోనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. బుధవారం శ్రావణ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని లాల్‌కమాన్ గడిమైసమ్మ బోనాల మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర భ్ంగా ఆయన మాట్లాడుతూ లాల కమాన్ గడిమైసమ్మ తల్లి దీవెనతో ప్రజలందరూ చల్లగుండాలని కోరారు.భోనాలంటే కేవలం హైద్రబాదే కాదు ఇప్పుడు సిద్దపేటలో కూడా ఘనంగా నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు.

**ఆంజనేయ స్వామి అనుగ్రహంతో అందరు ఆరోగ్యంగా ఉండాలి...**

శ్రీఆంజనేయస్వామి అనుగ్రహంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు.శ్రావణమాసం సందర్భంగా సిద్దిపేటలోని లింగారెడ్డి కాలనీలో జరిగిన శ్రీ భక్తాఆంజనేయ స్వామి ప్రతిష్టాకార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగ తగ్గించాలని దాంతో క్యాన్సర్ లాంటి మహమ్మారి రోగాలు ప్లాస్టిక్ వాడకంతోనే వస్తాయ్‌న్నారు.

## ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణం

**మర్కుక్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):**

పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలోగల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ మ్యాకల చంద్రకళ కనకయ్య దంపతులు శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామికి నాచారం దేవస్థానం మాజీ చైర్మన్ హరిపంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. కాగా కళ్యాణ మహోత్సవంలో బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీసీతారామచంద్రస్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ఈఆలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతుందని, సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాములోరి కళ్యాణం నిర్వహించిన మ్యాకల కనకయ్య దంపతులకు దేవదేవతల అనుగ్రహం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మంద బాల్‌రెడ్డి, మర్కుక్ మాజీ సర్పంచ్ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టులో పూడికతీత పనులు ప్రారంభించాలి

* రైతులకు బయోమెట్రిక్ ద్వారా యూరియా విక్రయాలు
* గురుకులంలో శానిటేషన్ లోపాలపై కలెక్టర్ అసహనం
* సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



నల్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**సిర్గాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాభారతితో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం, ఇన్‌ఫ్లో, ఆవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 408, ఎడమ కాలువల ద్వారా 1980 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు కాలువల్లో పేరుకు పోయిన చెత్తచెదారం, ముళ్లపొదలు, పూడికతీత పనులు ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువుల వద్దకు ప్రజలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆధికారులకు సూచించారు. మండలంలోని అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌డిఆర్ నిధులతో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల విక్రయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని, యూరియాను పంట సాగుకు మాత్రమే వినియోగించాలని సూచించారు. యరియా అక్రమంగా రవాణా కాకుండా రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసుకోవాలన్నారు. యూరియాను ఈపాస్ యంత్రాలను ఉపయోగించి బయోమెట్రిక్ తీసుకుని రైతులకు అందచేయాలని డీలర్లకు సూచించారు.

**నల్లవాగు రెసిడెన్షియల్‌ను సందర్శించిన కలెక్టర్...**

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో శానిటేషన్ పనులపై కలెక్టర్ బాధ్యులపై అక్షింతలు చల్లారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఇరిగేషన్ ఈఈ సుందర్, డిఈ పవన్ కుమార్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేశ ఉత్సవాలు నిర్వహించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్




గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, ఆగస్టు 20, ప్రభాతవార్త :**

సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్,డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి డీఎస్పీలు సంబంధిత జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు గణేశు ఉత్సవాలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు, గతంలో ఏర్పడిన సమస్యలు, ఇంకా మెరుగైన ఏర్పాట్లపై స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలాగే ఈ సంవత్సరం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరు సహకరించాలని ఈనెల 27 నుంచి జరిగే గణేష్ ఉత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక విగ్రహాలు ఎత్తు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపాలిటీ పోలీస్ సమన్వయంతో జిల్లాలో గణేష్‌మండపాల ఏర్పాటు ప్రదేశాలను ముందే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మున్సిపాలిటీ జిల్లా పంచాయతీ శాఖ ద్వారా శానిటేషన్ పై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో గ్రామాలలో జరిగే వినాయక మండపాల సమగ్ర సమాచారం పంచాయతీ సెక్రటరీలు ప్రణాళిక పొందించాలన్నారు. నిమజ్జనం రోజున అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆదేశించారు. గుంతలు పడిన రోడ్లను మరమతులు చేయించాలని తెలిపారు. మునిసిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టణ ప్రధాన రహదారితో పాటు గణేష్ మార్గ్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.ఉత్సవాల నిర్వహణపై ఆర్డీవోలు డీఎస్పీలతో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, పారిశుధ్యం, తాగునీరు తదితర విషయాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారి చూడాలని, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాటు, బోర్డుకు చిన్నచిన్న గుంతలు పూడ్చడం వంటి వాటిపై దృష్టి సారించాలని, శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించేలా చూడాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు విషయంలో ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డిజె సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత కల్పి స్తుందని నిమజ్జన సమయంలో భక్తులు సమన్వ యం పాటించాలని పోలీసు వారికి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తాసిల్దారులు,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాలలో సైన్స్ ఫేర్

### -పాఠశాలను సందర్శించిన జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి

జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త: జహీరాబాద్ సమీపంలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల పాఠశాలను బుధవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేఓజ, ఆర్ఎల్‌సి బహమతిలు సందర్శించారు. పాఠశాలలో బోధిస్తున్న విధానాన్ని ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ పరికరాలతో ప్రజంటేషన్ ఇచ్చారు. పాఠశాలలో తరగతి గదులను, ఇతర వార్డులను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుబీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైనార్టీ పాఠశాలలో సైన్స్ ఎక్స్పరిమెంట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## యూరియా కొరతలేదు... పుకార్లు నమ్మొద్దు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**టేక్మాల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని ఎవరూ ఆందోళన చెందవద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం టేక్మాల్‌లో ఓ ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రయదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సరిపడా యూరియా అందుబాటులో ఉందని అన్నారు. రైతులెవరూ ఫర్టిలైజర్ దుకాణాల్లోనముందు బారులు తీరాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. యూరియానే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను వాడవలసిందిగా సూచించారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నాయన్నారు. కొద్దిమంది కావాలని వదంతులు సృష్టించడం ద్వారా రైతులు సెప్టెంబర్ లో కొనవలసిన యూరియా ఇప్పుడే కొనడానికి షాపులు దగ్గర రావడంతో రద్దీ పెరుగుతుందని అలాగే వదంతులు నమ్మవద్దని వచ్చే పది రోజుల్లో ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్‌లో అవసరానికి తగ్గట్టు 4000 మెట్రిక్ టన్నుల యూరియా వ్యవసాయ శాఖ నుండి మన జిల్లాకు పంపడం జరుగుతుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారని కలెక్టర్ చెప్పారు. యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒకే షాప్ దగ్గర క్రౌడ్ కాకుండా రైతులు ఇబ్బంది పడకుండా యూరియా కొనుగోలు చేసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాగే సాగుకి సరిపడా యూరియా అమ్మకం పూర్తి అయ్యే వరకు వ్యవసాయ, స్పెషల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఏ మండలంలో ఎంత స్టాక్ ఉందనే సమాచారం రైతులకు తెలపాలన్నారు. ప్రస్తుతం టేక్మాల్‌మండలంలో 70 మెట్రిక్ టన్నుల యురియా అందుబాటులో ఉందన్నారు. మరో వారం పదిరోజుల్లో 100 మెట్రిక్ టన్నుల యూరియా రానుందన్నారు.నమెదక్ జిల్లాకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని వ్యసాయాధికారుల నివేదికల అధారంగా ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగిందని దాని ఆధారంగా ప్రభుత్వం యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని అన్నారు. రైతులకు అవసరపడ యూరియా అందుబాటులో ఉందని మరోమారు ఆయన స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురి కావొద్దని అన్నారు. ఇందులో తాసిల్దార్ తులసి రామ్, ఏవో రాంప్రసాద్, ఎంపీడీవో రియాజుద్దీన్, టేక్మాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీళ్లు వద్దులిన దృశ్యం

## సింగూరు జలాలు దిగువకు విడుదల

**పుల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు పెద్దస్థాయిలో చేరుకుంటుండటంతో నీటిని దిగువకు వదులుతున్నామని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 33705 క్యూసెక్కులు వస్తుండగా 43541 క్యూసెక్కుల వరదను 6,8,9,10,11 నంబర్ క్రస్ట్ గేట్లు, రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఆనకట్ట భద్రత దృష్ట్యా నీటి పారుదల శాఖ అధికారులు నీటి రాకను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దిగువకు నీటిని వదులుతున్నారు.

## వర్షానికి కూలిన ఇళ్లు



ఖాజాపూర్‌లో వర్షాలకు కూలిన ఇల్లు

**చిన్నశంకరంపేట, ఆగస్ట్ 20, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర గంగమ్మ నివాసిత ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## గణపతి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### -అధికారులతో డిఎస్‌పి సైదా నాయక్



మాట్లాడుతున్న డిఎస్‌పి సైదా నాయక్

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తారీఖు నుంచి ఆరంభం అయ్యే వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డిఎస్‌పి సైదా నాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని పోలీసు ఠాణాలో ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయిన డిఎస్‌పి అధికారులకు పలు సూచనలు చేశారు. వినాయక మండపాలకు విద్యుత్ అధికారులు విద్యుత్‌ను ఏర్పాటు చేయాలని, లంబోదరుడి నిమర్జనం జరిగే ప్రాంతాల్లో ఆర్అండ్‌బి, పంచాయితీరాజ్ శాఖ అధికారులు పాడైన రోడ్లను బాగు చేయాలన్నారు. మున్సిపల్ శాఖ పట్టణంలో పారిశుద్ధ పనులు చేపట్టాలన్నారు. విఘ్నేశ్వరుడి మండపాల వద్ద ప్రశాంతత ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పి దశరథ్, ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, పిఆర్ రవీందర్, విద్యుత్ శాఖ ఏఈ నాగరాజ్, మునన్సిపల్ శాఖ ఏఈ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ జానికిరామ్, పట్టణ, రూరల్, కోహిర్ పోలీసు ఠాణాల ఎస్సైలు వినయ్‌కుమార్, ఎం కాశీనాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకున్న ఎక్సైజ్అధికారులు

## ఎండుగంజాయి పట్టివేత

**మునిపల్లి, ఆగస్టు 20(ప్రభాతవార్త):** కర్ణాటకలోని బీదరు నుంచి హైదరాబాదుకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎండుగంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు.ఆయన కథనం ప్రకారం కరీంనగర్‌కు చెందిన తాజ్ మహ్మద్ బుధవారం నాడు బీదర్‌లో 440 గ్రాముల ఎండు గంజాయిని కర్ణాటక బస్సులో తీసుకు వస్తుండగా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నామన్నారు.గంజాయితో పాటు అతని వద్ద గల మొబైల్ పోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని,నిందితుడిని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో ఎస్సై అనిల్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ అలీం, కానిస్టేబుళ్లు యాదయ్య, కరీంలు పాల్గోన్నట్టు ఆయన తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 20 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన 11మందికి రూ.17వేల జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్‌పల్లి రోడ్, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేయగా 11 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా వారిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు వచ్చిందని తెలిపారు. బుధవారం వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 11 మందికి రూ.17వేల జరిమానా విధించడం జరిగిందన్నారు.

## 24న మంద కృష్ణమాదిగ రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
వికలాంగులు, చేయుతదారుల పెన్షన్ల పెంపుకై ఈనెల 24న పట్టణంలోని ఎన్‌కన్వెన్షన్‌లో నిర్వహించే సమావేశానికి పద్మశ్రీ మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సమావేశం ఎమ్మార్పీఎస్ ఆధ్యక్షతన వికలాంగుల పోరాటసమితి జిల్లా కన్వీనర్ రాయికోటి నరసింహులు సమన్వయంతో కొనసాగుతుందన్నారు. కార్యక్రమనికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జి జలదానికి నర్సింగ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మొదటినెలలోనే వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, పెన్షన్‌లు పెంచుతామని హామీ ఇచ్చినా అమలుచేయడం లేదని వాపోయారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ మండల ఇంచార్జి జైరాజ్, ఝరాసంగం మండల అధ్యక్షులు మైకల్ మాదిగ, కోహీర్ మండల అధ్యక్షులు రవికుమార్, మొగుడంపల్లి మండల అధ్యక్షులు నిర్మల్‌మాదిగ, నాయకులు రాజు, మనోజ్, నగేష్, యేసప్ప, రాజేందర్, సింగితం రాజు, అబ్రహంమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాలలో సైన్స్‌ఫెయిర్

-పాఠశాలను సందర్శించిన జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి



మైనార్టీపాఠశాలలో సైన్స్ ఎక్స్పెరిమెంట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
జహీరాబాద్ సమీపంలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల పాఠశాలను బుధవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేఓజ, ఆర్‌ఎల్‌సి బహమతిలు సందర్శించారు. పాఠశాలలో బోధిస్తున్న విధానాన్ని ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ పరికరాలతో ప్రజెంటేషన్ ఇచ్చారు. పాఠశాలలో తరగతి గదులను, ఇతర వార్డులను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుబీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

-అధికారులతో డిఎస్‌పి సైదానాయక్



గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న డిఎస్‌పి సైదానాయక్

**జహీరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
ఈనెల 27వ తారీఖునుంచి ఆరంభం అయ్యే వినాయకనవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలని డిఎస్‌పి సైదానాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని పోలీసుఠాణాలో ఆయాశాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయిన డిఎస్‌పి అధికారులకు పలు సూచనలు చేశారు. వినాయక మండపాలకు విద్యుత్ అధికారులు విద్యుత్‌ను ఏర్పాటుచేయాలని, లంబోదరుడి నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాడైనరోడ్లను బాగుచేయాలన్నారు. మున్సిపల్‌శాఖ పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. విఘ్నేశ్వరుడి మండపాలవద్ద ప్రశాంతత ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పి.దశరథ్, ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, పిఆర్ రవీందర్, విద్యుత్‌శాఖ ఎఈ నాగరాజ్, మున్సిపల్‌శాఖ ఎఈ నాగరాజు, ఇరిగేషన్ ఎఈ జానకిరామ్, పట్టణ, రూరల్, కోహీర్ పోలీసుఠాణాల ఎస్సైలు వినయ్‌కుమార్, ఎం.కాశీనాథ్, నరేష్ పాల్గొన్నారు.

## నానోయూరియాపై అవగాహన

-మండల వ్యవసాయాధికారిణి దీపిక



నానోయూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎవో దీపిక

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
నానోయూరియాను వినియోగించడం వల్ల పంటల్లో రైతులకు అధిక దిగుబడివచ్చి లాభాలువస్తాయని నర్సాపూర్‌మండల వ్యవసాయ అధికారిణి దీపిక అన్నారు. బుధవారం నర్సాపూర్‌మండలంలోని ఎరువుల దుకాణాలను పరిశీలించిన అనంతరం యూరియా కోసం వచ్చిన రైతులతో ఎవో దీపిక మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానోయూరియా వాడాలన్నారు. ఈమేరకు ఎరువుల దుకాణంలోనుండి నానోయూరియా చూపిస్తూ నానోయూరియా గురించి తెలియజేసి అవగాహన కల్పించారు. నానోయూరియా వినియోగం వల్ల పంటల వృద్ధి అధిక దిగుబడి నాణ్యత పెరుగుతుందన్నారు. నానోయూరియాతో మట్టి నీటికాలుష్యాన్ని తగ్గిస్తుందని పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. హరితగృహవాయువుల ఉద్గారాలు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటూ ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు సంప్రదాయ యూరియాకు బదులు నానోయూరియాను వినియోగించుకొని పంటల్లో అధికలాభాలు పొందాలని ఎవో దీపిక సూచించారు.

## ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ తనిఖీలు

**కొడంగల్ రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
కొడంగల్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి బుధవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నంతో కలిసి దుకాణాల్లో తనిఖీలతో రికార్డులు, స్టాకు నిల్వలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని సూచించారు. కృత్రిమ యూరియాకొరత సృష్టిస్తే చర్యలుతప్పవన్నారు. నానోయూరియా వాడకంతో కలిగే లాభాలపై రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయసంచాలకులు శంకర్‌రాథోడ్ పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళులు



నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి



రాజీవ్‌గాంధీ జయంతిని జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
భారత ఐటి విప్లవానికి శ్రీకారం చుట్టిన దూరదృష్టి గల నాయకులు మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ అని కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని రామచంద్రారెడ్డి నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పుష్పనగేష్ పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మావీన్‌గౌడ్, పీటర్, రాంజీ, శాంతమ్మ, హన్మంతు, రమేష్, సురేష్, రాకేష్, కిశోర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

**మనూర్‌లో...**

**మనూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌లో బుధవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్‌నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుకుమార్, రాజ్‌కుమార్, ఎర్రసాయిలు, తొంటా శ్రీనివాస్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**టేక్మాల్‌లో...**

**టేక్మాల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
రాజీవ్‌గాంధీ జయంతిని టేక్మాల్‌లో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్, మాజీ సర్పంచ్ పాపయ్య, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, యన్‌యుఐ కార్యదర్శి మహేష్‌రెడ్డి, మండలనాయకులు తలారి అవినాష్, సాగర్, కాంతం, అత్కూరి ధనంజయ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ స్వగృహంలో రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్‌పటేల్, ఎస్టీసెల్ అధ్యక్షులు నెహ్రూనాయక్, నాగల్గిద్ద మండలకాంగ్రెస్ అధ్యక్షులు మాణిక్‌రావుపటేల్, మనూర్‌మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగమేష్ పటేల్, మాజీ జడ్పిటిసి చందర్‌నాయక్, నాయకులు నారాయణరెడ్డి, బక్షిరాం, సోపాన్‌రావు, ఖాజామియా, గౌస్‌చిస్తి, ఖలేద్, దత్తురెడ్డి, అంజిరెడ్డి, అలీమ్, వహీద్, చోటుపటేల్ పాల్గొన్నారు.

**ఐటిరంగ సంస్కరణకు ఆద్యుడు రాజీవ్‌గాంధీ...**

-ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
ఐటి రంగం సంస్కరణకు ఆద్యుడు రాజీవ్ గాంధీ అని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారంరాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో దివంగత మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతివేడుకల్లో పాల్గొని, నివాళులర్పించారు. కార్యక్రంలో పట్లోళ్ల చంద్రశేకర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, వారితోపాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
రాజీవ్‌గాంధీజయంతిని బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ మెదక్‌జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయాలసంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డిల ఆధ్వర్యంలో మాజీప్రధానిరాజీవ్‌గాంధీజయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, సత్యం, నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుంటకు గండి... వృథాగా పోతున్న నీరు



అమ్ముకుంటకు గండిపడి నీరు వృథాగా బయటకు వెళుతున్న దృశ్యం

**వెల్దుర్తి, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మాసాయిపేటమండలంలోని నాగ్సాన్‌పల్లిగ్రామపరిధిలోగల అమ్ముకుంటకు గండిపడడంతో కుంటలోని నీరు వృథాగా బయటకువెళుతుంది. గత మూడు నాలుగు రోజుల నుండి భారీగా వర్షాలు కురియడంతో ఉమ్మడిమండలంలో చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు, ప్రాజెక్టు సైతం నిండి మత్తర్లు పొంగి పొర్లుతున్నాయి. అంతేకాక బుధవారం మాసాయిపేట మండలంలోని నర్సంపల్లి గ్రామశివారులోగల అమ్ముకుంటకు గండిపడడంతో భారీ ఎత్తున నీరు వృథాగా పోతుంది. ఈవిషయంపై ప్రజలు సంబంధిత అధికారులకు తెలుపగా సంబంధిత ఇరిగేషన్ అధికారులు వచ్చి పరిశీలించారు. గండి పెద్దగా పడడంతో భారీగా నీరు వృథాగా పోతుండడంతో అధికారులు స్పందించి వెంటనే గండిని పూడ్చి మరమ్మతులు చేపట్టాలని రైతులు డిమాండ్‌చేశారు.

## సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా

-పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సౌమ్యానాయక్




మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణచేస్తున్న పిఆర్‌టియు టిఎస్ నాయకులు

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో సెప్టెంబర్ 1న హైదరాబాదులో నిర్వహించే మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నర్సాపూర్‌మండల ప్రధానకార్యదర్శి బీమ్లానాయక్ ఆధ్వర్యంలో నర్సాపూర్ జెడ్‌పిహెచ్‌ఎస్ బాలురపాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన టిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వం 2003 డిఎస్సి విద్యార్థులకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈమేరకు ఈవిధానాన్ని రద్దు చేసేందుకు పిఆర్‌టియు టిఎస్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైద్రాబాద్‌లో మహాధర్నాచేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈమహాధర్నా కార్యక్రమానికి ఆల్ ఇండియన్ టీచర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ రోస్, టిఎన్జీవో టిజివో, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసి నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ అసోసియేట్ అధ్యక్షులు వీరేశం, మండల అసోసియేట్ అధ్యక్షులు ఇంతియాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలి

-విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి
-ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి అజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి అజయ్‌కుమార్ విద్యార్థులు

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాల సొంతభవనం శిథిలావస్థకు చేరుకోగా నూతన కళాశాల భవనాన్ని నిర్మించాలని అదేవిధంగా విద్యార్థులకు బస్సు సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కమిటీని ఎన్నుకోగా కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా సంధ్య, దుర్గాప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ నర్సాపూర్ మండలంలో నూతన కళాశాల కమిటీ 20 మందితో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉండగా నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈకళాశాలలో పలుసమస్యలు నెలకొనగా వాటినికూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా విద్యార్థులకు వివిధగ్రామాలనుండి బస్సులు సక్రమంగా రాకపోగా చదువులకు దూరమయ్యే పరిస్థితులు చోటుచేసుకున్నాయన్నారు. ఈమేరకు విద్యార్థుల సౌకర్యార్థం బస్సులనువేయాలని డిమాండ్‌చేశారు. ఈసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిఐఈఓకు తెలియజేశారు. సమస్యలు పరిష్కరించని యెడల విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్‌తోపాటు తూప్రాన్ డివిజన్ సెక్రెటరీ ఆంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక మండప నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి

-కొల్చారం ఎస్ఐ అహ్మద్ మోహీద్దీన్

**కొల్చారం, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
కొల్చారం మండలవ్యాప్తంగా వినాయకచవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కొల్చారం ఎస్ఐ అన్నారు. ఎస్ఐ అహ్మద్ మోహీద్దీన్ బుధవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వహణ కొరకు ముందస్తుగా పోలీసులు అనుమతులు తీసుకోవాలని ఆగస్టు 20నుంచి ఆగస్టు 26వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మండపాల నిర్వాహకులు కమిటీ వివరాలను దరఖాస్తులు నింపాలని, పూర్తి వివరాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్లో సంప్రతించాలని అన్నారు. పోలీసు అనుమతులు లేనిది మండపాలు ఏర్పాటుచేయడానికి వీలులేదని మండపాలతో రోడ్డు మొత్తం ఆక్రమించవద్దని వాహనాలు వెళ్లేందుకు స్థలం ఉంచాలన్నారు. మండపం నిర్వాహకులు విద్యుత్‌శాఖకు డిడిలు చెల్లించి విద్యుత్‌కనెక్షన్ విధిగా తీసుకోవాలని, అనుమతులు తీసుకోవాలని, సూచించారు. డిజెలకు అనుమతులులేవని ఒక్క సౌండ్‌బాక్స్‌కు మాత్రమే అనుమతి ఉందని అందులోనూ భక్తిగీతాలు మాత్రమే పెట్టాలని, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటలవరకు మైకులు, బాక్సులు వినియోగించవద్దని అన్నారు. విద్యాలయాలకు, ఆసుపత్రులకు, కార్యాలయాలకు, ప్రార్థన మందిరాలకు ఇబ్బంది కలగకుండా సౌండ్‌బాక్స్‌లను వాడాలని అన్నారు. మండపాలలో ఇద్దరు నిర్వాహక సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలని భద్రతకోసం సిసి కెమెరాలను అమర్చుకోవడం మేలని అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పక చేపట్టాలని అన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రతలుపాటించాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి తథ్యం

-ఎంపిడిఓ శంకర్

**చౌటకూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
కుట్టుశిక్షణ పొందితే స్వయం ఉపాధి అందుకోవడం తథ్యమని మండల అభివృద్ధి అధికారి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణకేంద్రాన్ని బుధవారం ఎంపిడిఓ ప్రారంభించారు. కుట్టునేర్చుకునే మహిళలకు ఉచితంగా నెలరోజులపాటు శిక్షణ ఇవ్వడంజరుగుతుందన్నారు. 20మంది గ్రూపుగా ఏర్పడితే అందరికీ (విద్యార్హత లేకుండా) శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు రాయితీపై కుట్టుమిషన్లు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయ జూనియర్ సహాయకులు శైలజ, శిక్షకురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేసిన ఎమ్మెల్యే

**సదాశివపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణం, మండలానికి చెందిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతుల మీదుగా సదాశివపేటలో అందజేశారు. మొత్తం 25 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులకుగాను వాటి విలువ రూ.579000 పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి కిష్టయ్య, మాజీ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ శ్రీధర్‌రెడ్డి మండల పట్టణ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, చిలమల్లన్న, పట్టణ ప్రధానకార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మండల యువత అధ్యక్షులు నరేష్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్, మండల మైనార్టీసెల్ అధ్యక్షులు నిజాముద్దీన్, మాజీ కౌన్సిలర్లు మోబిన్, నషీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్దిదారుకు అందజేసిన రాష్ట్ర నాయకులు పట్లోల చంద్రశేఖర్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలం ర్యాలమడుగు తండాకి చెందిన లక్ష్మీబాయికి చెక్కును పట్లోల చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. వారితోపాటు కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌సేట్, మాజీ ఆత్మచైర్మన్ ఈశ్వరప్ప, శంకర్, శివాజీ, మాజీసర్పంచ్‌లు రాంచెందర్, అర్జున్, మాజీ ఎంపిటిసిలు ఉన్నారు.

## ఎల్‌వోసి చెక్కు అందజేసిన ఎంపి సతీమణి

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల్ ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన నిజామోద్దీన్ అత్యవసర చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ఆదేశాల మేరకు సిఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.2లక్షల50వేలచెక్కును ఎంపిసతీమణి ఉమాదేవి సురేష్ కుమార్‌శెట్కార్ బాధితుడి కుటుంబబంధువులకు అందించారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
వినియోగదారులకు అవసరమైన నాణ్యమైన, అందుబాటు ధరలో దుస్తులను అందించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఎదురుగా లింగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయలక్ష్మి క్లాత్‌స్టోర్‌ను బుధవారం ప్రారంభోత్సవంచేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి దుకాణప్రారంభోత్సవంలో పాల్గొని లింగంకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పరిసర ప్రజలు దుస్తులు కొనుగోలు చేయడానికి నగరం వైపుకు వెళ్తున్నారని ఇక్కడ అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన ధరల్లో వస్త్రాలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈసందర్భంగా దుకాణం యాజమాని లింగం విచ్చేసి నాయకులను సన్మానించి మిఠాయి తినిపించారు.

ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపిపిలు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, సొసైటీ డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, జెఎసి కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ డైరక్టర్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీకౌన్సిలర్లు బండారి ఆంజనే యులు, షేక్ జహంగీర్, మున్సిపల్ కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బర్ల రాధాకృష్ణ, చెల్లక శ్రీధర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు వి.బి.వెంకటనారాయణ, రాజబోయిన రాంచందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్‌పై అవగాహన కార్యక్రమం

**జిల్లేడు చౌదరిగూడెం, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుదవారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఇదివరకు చదువుకుని మానేసిన విద్యార్థులను గుర్తించి వారికి మళ్లీ చదువును బోధించేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో గల ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఎపిఎం హరి తదితరులు పాల్గొన్నారు.

## వాగుల్లోకి కలుషిత వ్యర్థజలాలను వదులుతున్న ఎవరెస్టు పరిశ్రమ



వ్యర్థజలాలతో కొనాపూర్ వాగులో మృత్యువాత పడిన చేపలు

**మునిపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండల సమీపంలోని ఎవరెస్టు ఆర్గానిక్స్ పరిశ్రమ నుంచి వాగుల్లోకి కలుషిత వ్యర్థ జలాలు వదులుతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పెద్దగోప్లారం సమీపంలోని ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థజలాలను వాగుల్లోకి వదులుతున్నారు. గత వారంరోజులుగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనిని ఆసరగా చేసుకున్న పరిశ్రమ యాజమాన్యం రాత్రి వేళల్లో వరద ప్రవాహంలో రసాయన వ్యర్థ జలాలను వదులుతున్నారు. దీంతో పరిశ్రమ సమీపంలోని వెనుకగల లక్ష్మీనారాయణచెరువు, కొనాపూర్ వాగులోకి ప్రవహించి నీరంతా కలుషితమవుతున్నది. వర్షాలు కురుస్తుండటంతో రహస్యంగా రాత్రివేళల్లో వ్యర్థజలాలను వదులుతుండటంతో చుట్టుపక్కల పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఎవరెస్టు పరిశ్రమ నుంచి వస్తున్న కెమికల్ నీటి వల్ల బుధవారం కోనాపూర్ వాగులో చేపలు చనిపోవడం జరిగింది. ఎవరెస్టు కర్మాగారం వదులుతున్న వ్యర్థజలాలు తమ పంటపొలాల్లో నిండిపోయాయని గోప్లారం, కొనపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత జలాలు వదులుతూ తమ జీవితాలతో ఆడుకుంటున్న ఎవరెస్టు యాజమాన్యంపై చర్యలు తీసుకొని తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**కొల్చారం, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని కొంగోడ్ గ్రామంలో హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ అడుగుజాడల్లో యువత భవిష్యత్తులో నడవాలనే ఉద్దేశంతో బుధవారం గ్రామస్థుల సమక్షంలో చత్రపతి శివాజీ విగ్రహానికి భూమిపూజ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో యన్నారం యాదగిరి, గూడూరు నాగభూషణం, సాలె సత్యనారాయణ, వంజరి ఏగొండ, గంపల లక్ష్మణ్, గంపల పరుశరామ్, తుపాకుల మల్లేశం, కుక్కునూరు సత్య నారాయణగౌడ్, వంజరి స్వామి, వడ్ల రమేష్, యువత సంజీవులు, మహేష్, ప్రశాంత్, రామకృష్ణ, అశోక్, కుమార్, శ్రీశైలం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల పంపిణీకి కాంగ్రెస్ శ్రీకారం



రేషన్‌కార్డులు పంపిణీచేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

**న్యాల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండలానికి కొత్తగా మంజూరైన తెల్ల రేషన్ కార్డులను బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎంపిడిఓతో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలసందర్భంగా చేసిన ప్రతిహామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తూ వస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, మండలకాంగ్రెస్ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, డిసిసి కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీచైర్మన్ సిద్దలింగయ్యస్వామి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు సామేల్, నాయకులు కిరణ్‌గౌడ్, రఫీక్, గౌసోద్దిన్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షెలెగేరాలో పంటలను పరిశీలించిన అధికారులు



షెలెగేరాలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**మనూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని షెలెగేరాలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్, రైతులతోకలిసి నీటిపాలైన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు ఎఓ మహేష్‌చౌహాన్ పలు సూచనలు చేశారు. పత్తిపంటలో నీరునిలిస్తే కాలువలుతీసి నీటిని బయటకు పంపేయాలన్నారు. పత్తిపంట ఎర్రబారితే 20గ్రాముల యూరియాను 1లీటరు నీటిలో 1.25 మిల్లీలీటర్లు కలిపి పంటకు పిచికారి చేసుకోవాలన్నారు. పారావీల్ట్ తెగులు నివారణకు ప్రతి పత్తిమొక్కకు బ్లూకాపర్ శిలీంధ్రనాశనితో మూలాలు తడిసేలా ఎకరానికి 25 కిలోల యూరియాను, 15కిలోల పొటాష్‌ను ఎరువులా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

## వయోజనులందరూ అక్షరాస్యులుగా మారాలి

-మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్



ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా గ్రామాల్లోని వయోజనులందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకే నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరాస్యత పొందిన వయోజనులు ఓపెన్ స్కూల్ సొసైటీద్వారా 10వతరగతిలో విద్యను అందుకునే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎపిఎం టి.సరిత, ఆర్‌పిలు శ్రీకాంత్‌రెడ్డి, అనుముల గోపాల్, సిఆర్‌పిలు శివకుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో సరిపోయే మరుగుదొడ్లు

-కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్



విద్యార్థులను పరామర్శిస్తున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి

**పుల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను బుధవారం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ సందర్శించి ఇటీవల అనారోగ్యానికిగురైన విద్యార్థులనుపరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయని, ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాడైపోయిన మరుగుదొడ్లను వెంటనే మరమ్మతు పనులు చేపట్టి విద్యార్థులు ఉపయోగించుకునేలా చూడాలని డిమాండ్‌చేశారు. అవసరం మేరకు కొత్తమరుగుదొడ్లను నిర్మించాలన్నారు. గదులకు డోర్లు, కిటికీలు మరమ్మతు దశలో ఉన్నాయని, వాటిని బాగుచేయించాలన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గంగారాం పాల్గొన్నారు.

# పిఆర్సీ వెంటనే అమలు పరచాలి

-పెండింగ్ డిఏలను విడుదల చేయాలి

-ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ డిమాండ్




చాప్టా(కె) పాఠశాలలో సభ్యత్వం అందిస్తున్న జిల్లా నాయకత్వం

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సీ అమలు పరచాలని, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్‌అలీ డిమాండ్‌చేశారు. బుధవారం నారాయణఖేడ్ డివిజన్‌లోని పాఠశాలలను స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్‌సాబేర్‌అలీ, శ్రీనివాసరాథోడ్, రాష్ట్రకార్యదర్శి జీవన్‌రాథోడ్‌లు సందర్శించి సంఘ సభ్యత్వం అందించడం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ మాట్లాడుతూ గతంలో ఎన్నడులేనివిధంగా ఉద్యోగులకు ఐదు విడతల కరువు భత్యాన్ని మొండి బకాయిగా మార్చి ఆర్థిక మనోవేదనకు గురిచేస్తున్న ప్రభుత్వం వెంటనే డిఏలను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే 2023 జూలై ఒకటో తేదీనాటికే అమలు పరచాల్సిన పిఆర్సీని జాప్యంచేస్తూ రెండేళ్లు పూర్తి అయినా ప్రభుత్వంలో చలనంలేకపోవడం బాధాకరమని వెంటనే పిఆర్సీ రిపోర్టును తెప్పించి అమలుపరచాలని కోరారు. అలాగే ప్రభుత్వానికి, పేదవిద్యార్థులకు జీవితాంతం సేవచేసే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలనికోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఒక నిర్మాణాత్మక విధి విధానాలతో 79సంవత్సరాలుగా ఉపాధ్యాయ పక్షపాతిగా ఉన్న ఎస్టియు సంఘానికి భారీ ఎత్తున సభ్యత్వం ఇస్తూ సహకరిస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు సంఘం మరిన్ని సేవలను అందిస్తుందని వారు అన్నారు. అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్టిమెంట్‌నందు వేరే పాఠశాలలకు కేటాయించడం, ఎలక్షన్ డ్యూటీ తదితరాలను కేటాయిస్తూ మానసికహింసకు గురి చేయకూడదని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్‌సాబేర్‌అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాథోడ్, రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాథోడ్, జిల్లా మహిళాఉపాధ్యక్షురాలు శ్రీమతి నిర్మల, జిల్లా నాయకులు రాజ్‌కుమార్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రాథోడ్, నాగలిగిద్ద మండల అధ్యక్షులు శివశెట్టి, జిల్లా కార్యదర్శి కాశిరాం, నారాయణఖేడ్‌మండల ప్రధానకార్యదర్శి మారుతీ, నారాయణఖేడ్ మండల అధ్యక్షులు శివాజీ, జిల్లా కార్యదర్శి మాణిక్యం, మనూరుమండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌రాథోడ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, అనిల్, సిర్గాపూర్ ప్రధానకార్యదర్శి రంగ్‌లాల్, బండారి రాజు, ప్రవీణ్‌యాదవ్, పాల్గొన్నారు.

## దైవకృపతోనే ప్రజలు సుభిక్షం: నిర్మలాజగ్గారెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

**సదాశివపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
దైవకృపలోనే ప్రజలుసుభిక్షమని టిజిఐఐసిచైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. బుధవారం లోపలికోట హనుమాన్‌మందిరం కమిటీ అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాడుగుల సర్వోత్తమశర్మ పురోహితబృందం ఆధ్వర్యంలో ఈశ్వర నవగ్రహ పునర్ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మికచింతనలోనే మనశ్శాంతి లభిస్తుందని ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడుచుకోవాలన్నారు. అంతకుముందు ఉదయం ఆవాహిత దేవతాపూజ, తులాలగ్న సుముహూర్తమున యంత్ర విగ్రహ ప్రతిష్ఠ పూజలు మధ్యాహ్నం బలిప్రదానం మహా పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింత గోపాల్ నవగ్రహప్రతిష్ఠ పూజలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో లోపలికోట పద్మశాలిసంఘం అధ్యక్షులు మునిపల్లి రామకృష్ణ, మాజీకౌన్సిలర్ పట్లూరు నాగరాజుగౌడ్, లాల్‌బండ్ సత్యనారాయణ, శంకర్‌గౌడ్, పట్టణ పద్మశాలిసంఘం అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం, మునిపల్లి వెంకటేశం, మాణిక్ ప్రభు, రాష్ట్ర మాజీ బిసి డైరెక్టర్ పట్నం సుభాష్, నాగారం పెంటయ్య. ఆంజనేయులు, మనోహర్, తదితర భక్తబృందం పాల్గొన్నారు.

## కట్టమైసమ్మకు ఘనంగా పూజలు

-చెరువులు కుంటలు నిండడంతో ఆనందంతో రైతులు



కట్టమైసమ్మ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామ పరిధిలోని చెరువులు కుంటలు పూర్తిగా నిండినందున గ్రామవాసులు, రైతులు ఆనందం వ్యక్తంచేశారు. కానుకుంట గ్రామ ట్రాక్టర్ యూనియన్ సభ్యులు కట్టమైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ పలుగు గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాలను ఆచరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇంచుమించుగా అన్ని చెరువులు, ప్రాజెక్టులు డ్యాములు, గత ఐదు రోజుల్లో కురుస్తున్న వర్షానికి పూర్తిగా నిండాయని ఆనందం వ్యక్తంచేశారు. ఈ వర్షాల రాకతో రైతుల్లో ఆనందం, ఎక్కడచూసినా జలకళతో గ్రామాలు, గ్రామాలలోని చెరువులు ఉన్నాయని అన్నారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి రైతులున్నారని, వారి ఆనందాన్ని వెలకట్టలేమని అన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ప్రేమ్‌దాస్, ఉపాధ్యక్షులు పుర్ర సురేష్, జై.బిక్షపతి, వై.నాగరాజు, జి.మాధవరెడ్డి, ఎస్.సత్యనారా యణ, జె.మల్లేష్, టి.యాదిరెడ్డి, జె.శేఖర్, పి.గిరి, పి.సీను, ఏం.శీను, డి. దేవరాజ్, డి.సాయి, వై.ప్రవీణ్, జె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హాయంలోనే ఆర్టీసీ పురోగతి

-ఎమ్మెల్యే సంజీవరెడ్డి




నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ హయాంలోనే ఆర్టీసీ పురోగతి చెందిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ నుండి నిజామాబాద్‌కి నూతన బస్సును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్‌నుండి నిజామాబాద్‌కు ఎక్కువమందిప్రజలు ప్రయాణిస్తుంటారు. ఈబస్సు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా బస్సుప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వము కాంగెస్ అన్నారు. వయసుతో పనిలేకుండా అన్ని వయస్సుల మహిళలు, అమ్మాయిలు, బాలికలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడనుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వారితోపాటు పట్లోళ్ల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్‌నాయకులు ఆర్టీసీ డిపోమేనేజర్ మల్లేశం, తాహెర్ అలీ, మండలం కాంగ్రెస్ అధ్యక్షులు, పండరిరెడ్డి, ముంతాజ్, మాజీ ఎంపిటిసి, సుబర్, శంకర్‌ముదిరాజు, కిషన్‌నాయక్, గోవింద్ నాయక్, పాల్గొన్నారు.

## శ్రీహనుమాన్ ఆలయంలో శిఖర పునఃప్రతిష్ఠ



శిఖర స్థాపన చేస్తున్న పూజారులు

**సదాశివపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలో శ్రీఆంజనేయస్వామి దేవాలయం బట్టలబజార్ శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ అర్చకులు జంగం మహేష్ స్వామివారి నేతృత్వంలో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు దేవాలయ అధ్యక్షులు బరాడి శివ అన్నారు. శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమం రెండు రోజులుగా నిర్వహించినట్లు తెలియజేశారు. ఉదయం శిఖరానికి విశేషమైనటువంటి ఔషధీ స్నానము, తదుపరి ఆవాహిత మంటప ఆరాధన, రుద్ర స్వాకారహవనం, మన్యసూక్త హవనము నిర్వహించి ముహూర్త సమయానికి శిఖర స్థాపన చేసినట్లు తదుపరి దిగ్బలి పూర్ణాహుతి ఆంజనేయస్వామికి మహా మంగళ హారతి, భక్తులకు మహాప్రసాదం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్ఠ అర్చకులు రవికాంత్, విజయ్‌స్వామి, నాగభూషణంస్వామి, బాలరాజు, రవి, బరడి సాయి, చంద్రకాంత్, పరిగి శ్రీనివాస్, సాయిరామ్, దీపక్, దేవాలయ కమిటీ గౌరవ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల్లోకి గణపతి డిస్టిల్లరీ వ్యర్థజలాలు

-కలుషితం అవుతున్న నీరు-కష్టాలపాలవుతున్న జీవాలు



చెరువులోకి పారుతున్న వ్యర్థ పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

**చౌటకూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన గణపతి డిస్టిల్లరీ పరిశ్రమ వదులుతున్న వ్యర్థ పదార్థాల జలాలలో చెరువులు, కుంటలు కలుషితం కావడంతో జీవాలకు కష్టాలు తప్పడంలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గణపతి చక్కెర కర్మాగారం నుంచి మొలాసిస్‌ను చౌకూరులోని గణపతి డిస్టిల్లరీ పరిశ్రమకు తరలిస్తూ ఉంటారు. ఇక్కడ పరిశ్రమలో మోలాసిస్ లిక్కర్, ఇతర మద్యంతయారీకి స్పిరిట్‌ను వినియోగిస్తారు. మద్యం తయారీకి మొలాసిస్‌ను పెద్ద మొత్తంలో నిల్వ చేశారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను ఆసరాగా చేసుకున్న కర్మాగార యాజమాన్యం రాత్రి వేళల్లో గుట్టుచప్పుడుకాకుండా వరదప్రవాహంలో మొలాసిస్ వ్యర్థ జలాలను వదులుతున్నారు. పరిశ్రమ సమీపంలోని కోమటిచెరువు, ఈదులకుంటల్లోకి వ్యర్థజలాలుచేరుకుని నీరంతా కలుషితం అయ్యేలా చేస్తున్నాయి. కలుషితమైన నీటిని సేవించిన మూగజీవాలు అనారోగ్యాలకు గురవుతుండటంతో పాటు రైతులు సాగు చేసుకుంటున్న పంటలు పాడైపోతుండటంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. వ్యర్థజలాలతో తాము పడుతున్న పాట్లను రైతులు తహసీల్దార్ అనుదీప్ దృష్టికి తీసుకుపోగా స్పందించిన తహసీల్దార్ విచారణ చేయాలని, జలాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆర్ఐ ప్రమోద్‌కు సూచించడంతో ప్రమోద్ చెరువు, కుంటలను పరిశీలించి పరిశ్రమనుంచి వ్యర్థజలాలు వస్తున్నట్లుగుర్తించి తయారుచేసిన నివేదికను తహసీల్దార్ అనుదీప్‌కు అందచేసినట్లు తెలుస్తోంది.

## సమగ్ర సస్యరక్షణపై అవగాహన




సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సదాశివపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలం మద్దికుంట రైతువేదికలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ పంటలలో చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపైన కేంద్రీయ సమగ్ర సస్యరక్షణకేంద్రంవారు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా ఆయిల్ పామ్ పంటల మీద అవగాహనకార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలోభాగంగా పండ్లు, కూరగాయలు, పూలను పెంచే రైతులకు ఉద్యానశాఖ రాయితీలను అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ.50వేల సబ్సిడీని అందిస్తుందని సదాశివపేట ఉద్యాన అధికారి సునీత తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రంవారు, సదాశివపేట ఉద్యాన అధికారి సునీత, మండల వ్యవసాయ అధికారి రమేష్, సదాశివపేట వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన విస్తరణ అధికారి సతీష్, గోద్రెజ్ ఆయిల్ పామ్ ప్రతినిధి కొండలరావు, ఈశ్వర్, నిశిది డ్రిప్ ప్రతినిధి గంగాధరస్వామి, మద్దికుంట గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 23న ధర్నాను విజయవంతం చేయాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టిఎస్ యుటిఎఫ్ బాధ్యులు

**పుల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ(యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో మూడుదశల పోరాటంలోభాగంగా ఈనెల 23న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ చలో హైద్రాబాద్ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు టిఎస్ యుటిఎఫ్ బాధ్యులు పేర్కొన్నారు. మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు చేరుకుని కరపత్రాలను ఆవిష్కరించి ఉపాధ్యాయులు ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కె.సుదర్శన్, నాయకులు విజయలక్ష్మి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

-ఎస్సై రంజిత్‌రెడ్డి

**కౌడిపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
వినాయకచవితి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఎస్సై అధ్యక్షతన నిర్వహించిన శాంతిసమావేశంలో వినాయకమండపాల ఏర్పాటుదార్లతో ముఖ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలు, వినాయకవిగ్రహాల కమిటీసభ్యుల పూర్తి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా కరెంట్ సరఫరాల విషయంలో తగు జాగ్రతలు తీసుకోవాలని నిర్వాహకులకు ఎస్సై సూచనలు ఇచ్చారు. మండపాలలో వర్షం నీరు కురియకుండా చూసుకోవడంతో పాటు కరెంట్ షార్ట్‌సర్క్యూట్స్ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈనెల 27నుండి జరిగే గణేష్‌నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసే మండపాలు రోడ్డుకు అడ్డంగా, నిత్యం ప్రజలునడిచే మార్గంమధ్యలోలేకుండా ఇతరులకు ఇబ్బందులు కల్గించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన ర్యాలీ




దోమలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు అధ్యాపకులు

**నర్సాపూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో గల నర్సాపూర్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవాపథకం, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేగాక పెద్ద చింతకుంట గ్రామంలో విద్యార్థులచే దోమలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు గ్రామంలో ర్యాలీగా వెళ్లి ఇంటింటికి తిరిగి దోమల వల్ల కలిగే వ్యాధులు గురించి క్లుప్తంగా వివరించారు. ఇదిలా ఉండగా గ్రామంలోని ఇంటిపరిసరాల్లో ఉన్న పాతటైర్లలో, కొబ్బరిచిప్పలలో నిల్వ ఉన్న నీటిని వారు పారబోశారు. అధ్యాపకులు విద్యార్థులు విధిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ సమీరా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి.సురేష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఆదెప్ప, ఆరిఫ్, చంద్రమోళి, గణేష్, యాదగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి దుర్గామాత మహోత్సవాలు

**కొల్చారం, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
శ్రావణమాసం సందర్భంగా 14వ వార్షికోత్సవం పురస్కరించుకొని కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేటలోని దుర్గామాత ఆలయం వద్ద గురువారం ఉదయం నుండి ప్రత్యేకపూజాది కార్యక్రమాలు, పవిత్ర మంజీరాజలాలను తీసుకొనిరావడం, అభిషేకం, అమ్మవారికి అలంకారం, బోనాలు, ఒడిబియ్యం తదితర కార్యక్రమాలు నిర్వహించబడును. కార్యక్రమం నిర్వహణకుగాను విరాళాలు అందించుటకు భక్తులు తమవంతు సహకారం అందించాలన్నారు.

## బ్రాహ్మణ సంఘం రాష్ట్ర పిఆర్ఓ కన్వీనర్‌గా రాజశేఖర్ కులకర్ణి

**పుల్‌కల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**
రాష్ట్ర బ్రాహ్మణసంఘం సేవాసమాఖ్య (టిబిఎస్ఎస్ఎస్) పిఆర్వో కమిటీ రాష్ట్రకన్వీనర్‌గా జోగిపేటకుచెందిన రాజశేఖర్‌కులకర్ణిని ఎన్నుకున్నారు. వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్‌కులకర్ణి పదవీబాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర న్యాయవిభాగం కన్వీనర్‌గా సంగారెడ్డికిచెందిన విజయభాస్కర్‌దేశ్‌పాండే, కోకన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన రవిశంకర్ పట్వారీ, వాసుదేవరావు, సురేస్‌జోషి, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శిరీషకులకర్ణి, యువజనవిభాగం సహాయకార్యదర్శులుగా పాండురంగారావు, మారుతిరావు, తిరుమల్‌రావులను నియమించారు.